క్లుప్తంగా

నూతన విద్యుత్ కేంద్రం స్థాపనపై సంబరాలు



బాణసంచా కాల్చుతున్న ప్రజలు

రామగుండం: బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం స్థలంలో సింగరేణి నిధులతో నూతన విద్యుత్ కేంద్రం స్థాపనకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు ప్రకటన వెలువడడంతో.. సోమవారం అంబేడ్కర్ కూడలిలో ప్రజలు సంబరాలు జరిపారు. మాజీ కౌన్సిలర్ ఇసంపెల్లి అంజులు, సిరిశెట్టి సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. రామగుండంలో నూతన విద్యుత్ కేంద్రం స్థాపించడమే తన ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ పట్టణ ప్రజలకిచ్చిన హామీని త్వరలోనే నెరవేర్చనున్నారన్నారు. కాంగ్రెస్ ప్రతినిధులు మహ్మద్ ఉస్మాన్ షరీఫ్, చందర్, యాసిన్, శంకర్, గౌస్‌బాబా, ఇబ్రహీం, జబ్బార్, ఇఫ్తార్, లక్ష్మణ్, ప్రసాద్, యూసుఫ్, వెంకటమ్మ, ఫిరోజ్‌బాబా తదితరులున్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కమాన్‌పూర్: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సోమవారం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు కలిగి ఉండాలని సూచించారు. కళాకారులు జనగామ రాజనర్సు, ఊదునూరి పద్మ, బుర్ర శంకర్‌గౌడ్, శైలేంద్ర రాజన్న, జిన్న రమ, దీకొండ శ్రావణ్, కస్నూరి రేణుక, శ్రీవల్లి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రామగిరి: బేగంపేట గ్రామ శివారులోని గుట్ట ప్రాంతంలో ఆదివారం రాత్రి కొందరు వ్యక్తులు పేకాటాడుతున్నట్లు సమాచారమందగా.. బేగంపేట గ్రామానికి చెందిన 8 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.93,950 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు సమాచారం.

నేత్రదాతలు.. స్ఫూర్తిప్రదాతలు

కోల్‌సిటీ: నేత్రదానం చేసి నలుగురు అంధులకు చూపును ప్రసాదించిన ఇద్దరు నేత్రదాతలు స్ఫూర్తిప్రదాతలని సదాశయ ఫౌండేషన్ జాతీయ గౌరవ అధ్యక్షుడు, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గోదావరిఖని కల్యాణ్‌నగర్‌కు చెందిన కొత్వాల్ కిషన్, స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన అనిగాల కనకమ్మ ఇటీవల మృతిచెందగా.. వీరిద్దరి నేత్రాలను వారి కుటుంబ సభ్యులు ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం నేత్రదాతల నివాసాల దగ్గర వేర్వేరుగా సంస్మరణ సభలను సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించాయి. ముందుగా నేత్రదాతలకు మౌనం పాటించి నివాళి అర్పించాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఫౌండేషన్ జాతీయ గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజమౌళి మాట్లాడారు. నేత్రదాతల కుటుంబాలను అభినందించి సత్కరించి అభినందన పత్రాన్ని అందజేశారు. కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎస్.శంకర్, ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధి కె.ఎస్.వాసు, దేవి లక్ష్మీనర్సయ్య, సురేష్ కుమార్, డప్పు శంకర్, అవినాష్ పాల్గొన్నారు.

చెరువు నీరు వదలడంతో రైతుల ఆందోళన



వృథాగా పోతున్న నీటిని చూపిస్తున్న రైతులు

ముత్తారం: పారుపల్లి పెద్ద చెరువు మత్తడి తూమును లేపి గుర్తుతెలియని వ్యక్తులు నీరు వదలడంతో వరి మునుగుతోందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంట దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. చేపల కోసం చెరువు నీరు వదిలి రైతులను నష్టపరచాలని చూస్తున్న గుర్తుతెలియని దుండగులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చెరువు ఎండిపోయి ఆయకట్టు రైతులకు నష్టం జరిగే అవకాశముందని వాపోయారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు ప్రారంభం



జూలపల్లి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు



ముత్తారం: పదోతరగతి విద్యార్థులు

జ్యోతినగర్: పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చాలామంది పరీక్షలకు సకాలంలో హాజరు కాగా.. కొందరు చివరి నిమిషంలో పరుగులు తీశారు. ఎన్టీపీసీ రామగుండం జ్యోతినగర్ ప్రాంతంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాశారు. పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని సెయింట్ క్లేర్ హైస్కూల్, టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, జిల్లా ప్రజాపరిషత్ హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ ఎస్సై ఉదయ్‌కిరణ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉన్నారు.

మంథని: మంథనిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జిల్లాపరిషత్ బాలికల ఉన్న పాఠశాలల పరీక్ష కేంద్రాల్లో 516 మందికి 512 మంది హాజరయ్యారు.

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్, కూనారం పరీక్షా కేంద్రాల్లో 290 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, ఎంపీపీ నూనేటి సంపత్, తల్లిదండ్రులు ఆల్ ది బెస్ట్ చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. జిరాక్స్ సెటర్లను మూసివేయించారు.

ధర్మారం: ధర్మారం ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 190 మంది విద్యార్థులు, దొంగతుర్తిలో 90 మంది, మోడల్ స్కూల్‌లో 180 మంది, నందిమేడారం హైస్కూల్‌లో 154 మంది, మల్లాపూర్ సాంఘిక గురుకులం విద్యాలయంలో 120 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. దొంగతుర్తిలో ఒకరు, మల్లాపూర్ సెంటర్‌లో ఒకరు గైర్హాజరైనారని మండల విద్యాధికారి చాయాదేవి తెలిపారు.

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలో 264 మందికి 264 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ముత్తారం: ధర్యపూర్ మోడల్ స్కూల్‌లో ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 227 మంది విద్యార్థులకు గాను వంద శాతం హాజరయ్యారని ఇన్‌చార్జి ఎంఈవో లక్ష్మి తెలిపారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 262 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. చీఫ్ సూపరింటెండెంట్ సదయ్య, డీవో సత్యం పర్యవేక్షించారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలల 87 మంది పరీక్ష రాయగా.. ఒకరు గైర్హాజరైనట్లు సిబ్బంది తెలిపారు. సీఎస్ బషీర్, డిపార్ట్‌మెంటల్ అధికారి రమేశ్, పరీక్షల ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లాపరిషత్ పాఠశాలలో 132 మందికి 132 మంది హాజరైనట్లు సీఎస్ కొమురయ్య తెలిపారు. ఎస్సై చంద్రశేఖర్ సిబ్బందిని ఏర్పాటు చేశారు.

రామగిరి: వాణి పాఠశాలలో 180 మందికి 180 మంది, నాగెపల్లి ప్రభుత్వ పాఠశాలలో 140 మందికి 140 మంది హాజరయ్యారు. ఎస్సై సందీప్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గోదావరిఖనిటౌన్: రామగుండంలో జెడ్పీహెచ్‌ఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్టీపీసీలో జెడ్పీహెచ్‌ఎస్, సచ్‌దేవ్ పాఠశాల, సెంట్‌క్లేయిర్, గోదావరిఖనిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సేయింట్‌పాల్ హైస్కూల్, సిద్ధార్థ హైస్కూల్, కృష్ణవేణి హైస్కూల్, సింగరేణి సెక్టార్–2 పాఠశాల, సెక్రెడ్ హార్ట్ హైస్కూల్, అంతర్గాం మండలంలో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, పాలకుర్తి మండలంలో బసంత్‌నగర్ ఐఎంఎస్ స్కూల్, జయ్యారంలో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మొత్తం 15 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,900 మంది విద్యార్థులు, జిల్లావ్యాప్తంగా 7,725 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా.. 9 మంది గైర్హాజరుతో 7,716 మంది హాజరయినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు ముగిసింది.



యైటింక్లయిన్‌కాలనీ: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు



కాల్వశ్రీరాంపూర్‌లో విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరెడ్డి



జ్యోతినగర్: చివరి నిమిషంలో పరుగు తీస్తున్న విద్యార్థి



కమాన్‌పూర్‌లో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



గోదావరిఖనిటౌన్: గది నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



ఎలిగేడు పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న సిబ్బంది

తెలుగు ప్రశ్నాపత్రం ఆలస్యం

- బసంత్‌నగర్‌లోని పరీక్ష కేంద్రంలో ఘటన
- సమయం సరిపోక ఇబ్బందిపడ్డ విద్యార్థులు



జయ్యారంలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై స్వామి

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్ష కేంద్రంలో సోమవారం తెలుగు పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం దాదాపు 20 నిమిషాలు ఆలస్యంగా ఇవ్వడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొదటి రోజు పరీక్ష కావడంతో సాధారణంగా విద్యార్థులు కొంత ఒత్తిడికి లోనై ఉంటారు. దీనికి తోడు సకాలంలో ప్రశ్నాపత్రం ఇవ్వకపోవడంతో సమయం సరిపోక కొన్ని ప్రశ్నలకు జవాబులు రాయలేకపోయామని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది ఇన్విజిలేటర్లు మాస్ కాపీయింగ్‌కు సహకరిస్తున్నారని విద్యార్థులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వస్తే పరీక్షలకు అనుమతించని అధికారులు.. 20 నిమిషాలు పేపర్ ఎందుకు ఆలస్యంగా ఇచ్చారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కేంద్రం సూపరింటెండెంట్ ఖాజామొయినోద్దీన్‌ను వివరణ కోరగా.. ప్రశ్నాపత్రాల కౌంటింగ్ విషయంలో లెక్క తప్పి ఐదు నుంచి పది నిమిషాలు ఆలస్యమైందన్నారు. మండలంలో బసంత్‌నగర్, జయ్యారం గ్రామాల్లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 325 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను బసంత్‌నగర్ ఎస్సై స్వామి తనిఖీ చేశారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



సుల్తానాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

సుల్తానాబాద్: విద్యార్థులు పరీక్షలను మానసిక ప్రశాంతతతో రాయాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. సోమవారం 10వతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెంటర్లను ఆయన సందర్శించారు. సుల్తానాబాద్‌లో నాలుగు సెంటర్లుండగా.. 824 మందికి 823 మంది హాజరయ్యారని ఇన్‌చార్జి ఎంఈవో సురేందర్ తెలిపారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, పరీక్ష సెంటర్ సీఎస్, సిబ్బంది ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ఆదమరిస్తే అంతే..

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల రోడ్డులో శ్రీమయి గ్యాస్ ఏజెన్సీస్ ముందు సీసీ రోడ్డుపై పెద్ద గుంత ఉంది. వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం జరిగే ఆస్కారముంది. స్థానికులు గుంత చుట్టూ ఇటుకలు పేర్చినా.. రాత్రి సమయాల్లో వచ్చేవారికి ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. సంబంధిత విభాగం వారు వెంటనే స్పందించి గుంతను పూడ్చాలని స్థానికులు వేడుకుంటున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ రవీందర్

యైటింక్లయిన్‌కాలనీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని టూటౌన్ సీఐ జి.రవీందర్ అన్నారు. సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లోని తన చాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.50వేలకు పైగా నగదు ఉంటే దానికి సంబంధించిన సరైన పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు ఈనెల 19న టూటౌన్ పరిధిలోని వీర్లపల్లి గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టూటౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్ పోస్టుల సందర్శన

పాలకుర్తి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టులను బసంత్‌నగర్ ఎస్సై స్వామి సోమవారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోర్‌లైన్ రహదారిపై కన్నాల టోల్‌ప్లాజా వద్ద ఒకటి, వేంనూర్ గ్రామ శివారులో మరో చెక్ పోస్టు ఏర్పాటు చేయగా.. ఎస్సై సందర్శించి స్థానికంగా వాహనాల తనిఖీ నిర్వహించారు.

ఎంపీవోపై దాడిని ఖండిస్తూ నిరసన



కాల్వశ్రీరాంపూర్ మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శుల నిరసన

కాల్వశ్రీరాంపూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కోడూర్ ఎంపీవోపై ఎంపీపీ దాడిని ఖండిస్తూ కాల్వశ్రీరాంపూర్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ నేతృత్వంలో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎంపీపీ నూనేటి సంపత్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్దన్, సూపరింటెండెంట్ సురేశ్, పీఆర్‌ఏఈ మల్లేశం, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ మండల అధ్యక్షుడు కంకణాల రాజేశ్‌కుమార్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, మంగారెడ్డి, శైలజ, అమ్జద్, నవీన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల: ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో భాస్కర్, కార్యదర్శులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఎంపీవో భాస్కర్ మాట్లాడుతూ.. ఎంపీవోపై దాడి జరగటం దురదృష్టకరమన్నారు. పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల సందీప్, భానుప్రసాద్, ఆవుల శ్రీనివాస్, దిలీప్, వెంకటేశ్, నవ్య, మీనా పాల్గొన్నారు.

కార్మికులకు కంప్యూటర్ సేవ



కంప్యూటర్ ప్రారంభిస్తున్న రాజారెడ్డి

గోదావరిఖని: కార్మికులకు కంప్యూటర్ సేవలందించనున్నామని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు అన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో నూతన కంప్యూటర్‌ను ప్రారంభించారు. కార్మికులు విధి నిర్వహణలో పొరపాట్లు జరిగితే యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందన్నారు. ఈక్రమంలో లెటర్ల ద్వారా సమాధానం చెప్పేందుకు కంప్యూటర్ నెలకొల్పినట్లు తెలిపారు. సింగరేణిలో అనేక డిజిగ్నేషన్లలో రిక్రూట్మెంట్ పెద్దసంఖ్యలో సాగుతున్న తరుణంలో.. పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగులు, ఇంటర్నల్ కార్మికులకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించేందుకు రామగుండం రీజియన్‌లోని గోదావరిఖని కేంద్రంగా ప్రారంభించిన కంప్యూటర్ ఉపయోగపడుతుందన్నారు. నాయకులు మెండె శ్రీనివాస్, ఆసరి మహేశ్, సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, తోట నరహరిరావు, సానం రవి, నంది నారాయణ, కారం సత్తయ్య, పి.శ్రీనివాస్, భీమానాయక్, రాజేంద్రప్రసాద్, సుమన్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు

కోల్‌సిటీ(రామగుండం): సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని, వారి బారి నుంచి తప్పించుకోవాలంటే అవగాహన ఒక్కటే మార్గమని సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సీపీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ అట్టెం శంకర్, కానిస్టేబుళ్లు కుమార్, డి.శ్రీనివాస్, నిమ్మతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిత్ర కథ



మబ్బులతో రైతన్న దిగులు

కమాన్‌పూర్: నాలుగు రోజుల నుంచి ఆకాశంలో వస్తున్న మార్పులతోపాటు ఉదయం, సాయంత్రం కారుమబ్బులు వచ్చి చిన్నపాటి చిరుజల్లులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగిలో సాగు చేసిన వరి పంట పొలాలు కోత దశకు రాగా.. అకాల వర్షం పడితే చేతికొచ్చిన పంటలు నేలపాలై చేతికి రాకుండా పోతాయని ఆవేదన చెందుతున్నారు.

ఆధ్యాత్మికం

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి



బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న అర్చకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఆరు రోజులపాటు నిర్వహించనున్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ 38వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ప్రధాన అర్చకుడు జగన్నాథాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణంలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 19 నుంచి 24 వరకు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాల్గొనే భక్తులు ముందుగా ఆలయంలో సంప్రదించాలని సూచించారు. ఆలయ అర్చకులు, సభ్యులు పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణపతి, ఇతర పూజలను పూజారి శ్రవణ్‌కుమార్ నిర్వహించారు. శివాలయంలో గడ్డం మనోజ్–వర్ష దంపతులు రుద్రాభిషేకం, పల్లా శివకుమార్–పల్లవి దంపతులు 3,016 మారేడు దళాలతో ప్రత్యేక పూజలు చేశారు. పూజారి మహేశ్‌కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


కొమురన్న జాతరను సందర్శించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ శివారులో రెండు రోజులుగా కొనసాగుతున్న గొప్పు కొమురన్న జాతర సోమవారం ముగిసింది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. జాతర ప్రాంగణాన్ని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. ఆలయ కమిటీ కార్యనిర్వాహక ప్రతినిధి గొప్పు అయిలయ్యయాదవ్ భక్తులకు అన్నదానం చేశారు. గొప్పు వంశీయులు మల్లయ్యయాదవ్, కొమురయ్యయాదవ్ తదితరులున్నారు.

గోమాత ప్రతిమల పంపిణీ



మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిని సన్మానిస్తున్న సూర్య

సుల్తానాబాద్: మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, కమిషనర్ వేణుమాధవ్, సీఐ సుబ్బారెడ్డిని కలిసిన శ్రీధర్మశాస్త్ర గోశాల ఫౌండేషన్ చైర్మన్ బండారి సూర్య గోమాత ప్రతిమలను సోమవారం అందజేశారు. గోశాలను సందర్శించాలని విన్నవించారు. గోశాల సభ్యులు గుండా రవీందర్, జక్కీ రమేశ్, నల్ల వెంకటేశ్, నాగిశెట్టి నగేశ్, సతీశ్, ఎనగందుల శివకృష్ణ, కనుకుట్ల రవి, సురేష్‌శర్మ, హరీశ్‌పటేల్, రాందాస్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు ఈనెల 31 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మెహరాజ్ తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంతోపాటు సమీపంలోని గురుకులాల్లో సంప్రదించాలన్నారు.

జిల్లాలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాల కోసం నిర్వహించే ఆర్‌జేసీ సెట్, బీసీ, ఎస్సీ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించే ఆర్‌డీసీ సెట్ ప్రవేశ పరీక్ష కోసం ఏప్రిల్ 12 లోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి గౌతంకుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 బాలుర, 13 బాలికల జూనియర్ కళాశాలలున్నాయని పేర్కొన్నారు.